చెడును వదిలి మంచి మార్గంలో పయనించాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు పక్కన కలెక్టర్, ఎస్పీ

నీలగిరి, అక్టోబర్2 : సమాజంలో ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీని స్ఫూర్తిగా తీసుకొని చెడును వదిలి మంచి మార్గంలో పయనించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.నాగరాజు అన్నారు. బుధవారం గాంధీ జయంతి, జిల్లా ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా జైలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చేసిన తప్పును మళ్లీ చేయకుండా దానిని సరిదిద్దుకొని సమాజానికి ఉపయోగపడేవిధంగా సత్ప్రవర్తన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. జైలులో ఖైదీలకు అన్ని సౌకర్యాలు ఉంటాయని, వాటిని వినియోగించుకొని బయటికి వచ్చిన తర్వాత సమాజానికి ఉపయోగపడాలన్నారు. సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను ముఖ్యమైన దినాల్లో జైలు నుంచి విడుదల చేస్తారని, అండర్ ట్రయల్ మీటింగ్ సమయంలో వారి సత్ప్రవర్తన ఆధారంగా బెయిల్ ఇవ్వడం లేదా శిక్ష తగ్గించడం వంటివి ఉంటాయని తెలిపారు. సత్యం, అహింస, శాంతి మార్గాలను అనుసరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి మాట్లాడుతూ తప్పులు అందరూ చేస్తారని వాటిని పశ్చాతాపంతో సరిదిద్దుకొని తిరిగి చేయకుండా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంతాలను అందరూ అనుసరిస్తే ఎలాంటి సమస్యలు ఉండవన్నారు. అంతకుముందు గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ దీప్తి, 12వ బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాస్‌రావు, జిల్లా జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జిల్లా జైలర్ బాలకృష్ణ, ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి, తాసీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించాలి

● ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

రోడ్లను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, అక్టోబర్ 2: సత్యాగ్రహమే ఆయుధంగా, అహింసా మార్గంలో పోరాడి మన దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన జాతిపిత మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా నియోజకవర్గంలో ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. కంపోస్టబుల్ కవర్ల గురించి స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్థానిక సాగర్ రోడ్డులోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే బీఎల్ఆర్‌తో పాటు నాయకులు, రైస్‌మిల్లర్లు, స్వచ్ఛంద సంస్థల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. 'నేను నా మిర్యాలగూడ' కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ కవర్ల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంపోస్టబుల్ కవర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంలోని రోడ్లను శుభ్రం చేశారు. ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదాతలను అభినందించి ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్ నాయక్, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రైస్‌మిల్లర్స్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చెర్వుగట్టు రామలింగేశ్వరుడికి లక్ష పుష్పార్చన

స్వామివారికి లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్న అర్చకులు

నార్కట్‌పల్లి, అక్టోబర్ 2 : మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధానార్చకులు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్ భక్తులకు అవసరమైన వసతులు కల్పించారు.

కనకదుర్గాదేవికి చేనేత పట్టుచీర అందజేత

అమ్మవారి చీరను ఊరేగింపుగా తీసుకెళ్తున్న పద్మశాలీలు

చిట్యాల, అక్టోబర్ 2 : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా స్థానిక భక్త మార్కండేయ పద్మశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేయించిన చేనేత పట్టు చీరను చిట్యాలలోని కనకదుర్గామాతకు బుధవారం సమర్పించారు. హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపుగా చీరను తీసుకొచ్చి కనకదుర్గ ఆలయంలో అమ్మవారికి సమర్పించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని చేనేత చీరతో అలంకరణ చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు, పద్మశాలి కులపెద్దలు పాల్గొన్నారు.

నేడు నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

నకిరేకల్, అక్టోబర్ 2 : నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.బాలయ్య తెలిపారు. నల్లగొండ ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న రాచకొండ శ్రీనివాస్‌పై ఆగస్టు 12న కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గడంతో ఆయన పదవి కోల్పోయారు. ప్రస్తుతం వైస్ చైర్మన్ మురారిశెట్టి ఉమారాణి ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ఊరూరా పూల జాతర

● జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుక

● బతుకమ్మలతో తరలివచ్చి ఆడి పాడిన ఆడబిడ్డలు

రామగిరి, అక్టోబర్ 2: తెలంగాణ ఆడపడుచుల పండుగ బతుకమ్మ ఉత్సవాలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఎంగిలిపూల బతుకమ్మను పల్లె నుంచి పట్టణందాక వాడవాడలా సంబురంగా జరుపుకొన్నారు. జిల్లా కేంద్రంలో తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో, వివేకానందనగర్‌లోని సీతారామచంద్రస్వామి ఆలయంలో, దేవరకొండ రోడ్డులోని సిద్ధార్థ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో, పాతబస్తీ సంతోషిమాత ఆలయం సమీపంలో, కనకదుర్గా కాలనీ హనుమాన్‌దేవాలయం, బీటీఎస్, కలెక్టరేట్ సమీపంలోని దేవాలయాల్లో , లక్ష్మీ నగర్, చర్లపల్లి, మర్రిగూడ, ఆర్జాలబావి ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మ సంబురాలు జరిగాయి.

నల్లగొండ రామాలయం వద్ద బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మహిళలు

బతుకమ్మలతో మహిళ

కొండమల్లేపల్లిలోని సీతారామచంద్రమౌళీశ్వర అలయంలో బతుకమ్మ అడుతున్న మహిళలు

దుప్పలపల్లిలో బతుకమ్మలతో తరలివస్తున్న యువతులు

హాలియాలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే భగత్‌కుమార్

కేసీఆర్ పాలనలోనే బతుకమ్మకు ఖండాంతర ఖ్యాతి

● మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

హాలియా, అక్టోబర్ 2 : కేసీఆర్ పాలనలోనే బతుకమ్మ పండుగకు ఖండాతర ఖ్యాతి లభించిందని మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. బుధవారం హాలియాలోని సాయిబృందావనం కాలనీలో కుటుంబ సభ్యులు, మహిళతో కలిసి ఎంగిలిపూల బతుకమ్మ పండులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న తరువాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో పాటు ఘనంగా నిర్వహించిందని తెలిపారు. నేడు రాష్ట్రం, దేశంలోనే కాక విదేశాల్లో ఉన్న తెలంగాణ మహిళలు సైతం బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకొంటున్నారని పేర్కొన్నారు. బతుకమ్మ పేరుతో పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజలదని అన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళలకు చీరలు ఇచ్చి గౌరవించిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అవేవీ పట్టించుకోవడం లేదన్నారు.

మిర్యాలగూడ : రామచంద్రగూడెంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

మునుగోడు : మండల కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నల్లగొండలోని మీర్‌బాగ్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

చర్లపల్లిలోని నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నల్లగొండలోని తిరుమల నగర్‌లో ..

చర్లపల్లిలోని సాయిబాలాజీ కాలనీలో సంబురాల్లో పాల్గొన్న మహిళలు

మిర్యాలగూడటౌన్ : హౌసింగ్‌బోర్డ్‌లో బతుకమ్మలు ఆడుతున్న చిన్నారులు

మిర్యాలగూడ రూరల్ : రుద్రారంలో బతుకమ్మలను వేదిక వద్దకు తీసుకెళ్తున్న మహిళలు

కేతేపల్లి : బతుకమ్మలతో తరలివెళ్తున్న శాలిగౌరారం మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ తేజస్వి, మహిళలు

నార్కట్‌పల్లి : వెంకటేశ్వర్లబావి గ్రామంలో బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న, మహిళలు, చిన్నారులు

నేపాల్‌లో బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామస్తులు

నల్లగొండలోని రాక్‌హిల్స్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

మిర్యాలగూడ : బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు

నల్లగొండలోని శ్రీకృష్ణ దేవాలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నల్లగొండలోని పద్మావతీ కాలనీలో బతుకమ్మ వేడుకలు

శ్రీనగర్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

నల్లగొండలోని న్యూవీటీ కాలనీలో ....

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన షురూ

● ఈ నెల 5 వరకు డైట్‌లో కొనసాగనున్న ప్రక్రియ

డైట్‌లో ధ్రువపత్రాల పరిశీలనకు వచ్చిన అభ్యర్థులు

రామగిరి, అక్టోబర్ 2: డీఎస్సీ–2024లో ర్యాంకులు సాధించి 1:3లో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం ప్రారంభమైంది. ఈ నెల 5 వరకు సర్టిఫికెట్ల పరిశీలన చేసి ఎంపికైన వారికి ఈ నెల 9న నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. మంగళవారం రాత్రి ఎస్‌జీటీ విభాగంలో 1:3లో ఎంపికైన అభ్యర్థుల జాబితా రాష్ట్ర విద్యాశాఖ నుంచి రావడంతో షెడ్యూల్‌లో భాగంగా డీఈఓ బి.భిక్షపతి ।ప్రత్యేక పర్యవేక్షణలో నల్లగొండ డైట్‌లో 9 కౌంటర్ల ద్వారా పరిశీలన ప్రారంభించారు. స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో 1:3లో ఎంపికైన అభ్యర్థుల జాబితా బుధవారం రాత్రి విడుదల కావడంతో గురువారం వారికి సంబంధించిన సర్టిఫికెట్ల పరిశీలన మొదలు కానున్నది. జిల్లాకు ప్రత్యేక పరిశీలకులుగా నియామకమైన సీహెచ్. రమణకుమార్ పరిశీలనకు హాజరు కానున్నారు.

తొలిరోజు పరిశీలన

జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీటీ కేటగిరిలో 1:3లో 1014 మంది అభ్యర్థులు ఎంపిక కాగా వీరిలో తెలుగు మీడియంలో 1029, ఉర్దూలో 12 మంది ఉన్నారు. ఉదయం 7 కౌంటర్లు ఏర్పాటు చేయగా అభ్యర్థుల తాకిడి అధికంగా ఉండటంతో మధ్యాహ్నం డీఈఓ ఆదేశాలతో వాటి సంఖ్యను 9కి పెంచారు. ప్రతి కౌంటర్‌లో ఇద్దరు సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో పరిశీలన చేయగా సాయంత్రం 6:30 గంటల వరకు పరిశీలన కొనసాగింది. తొలిరోజు మొత్తం మొత్తం 212 మంది హాజరైనట్లు డీఈఓ వెల్లడించారు.

నేటి నుంచి స్కూల్ అసిస్టెంట్, పీఈటీలకు..

స్కూల్ అసిస్టెంట్, లాంగ్వేజ్ పండిట్స్, పీఈటీలకు సంబంధించి 1:3లో ఎంపికైన అభ్యర్థుల జాబితా బుధవారం రాత్రి రాష్ట్ర విద్యాశాఖ నుంచి వచ్చినట్లు డీఈఓ బి.భిక్షపతి వెల్లడించారు. ఎంపికైన వారి మొబైల్స్‌కు మెసేజ్‌లు వచ్చాయని, వారంతా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్స్ జిరాక్స్‌లను తీసుకుని గురువారం పరిశీలనకు రావాలని కోరారు. గురువారం ఎస్‌జీటీ అభ్యర్థులకు 12 కౌంటర్లదార్వా, స్కూల్ అసిస్టెంట్, ఎల్‌పీ, పీఈటీలకు సబ్జెక్టులకు ఒక్కో కౌంటర్ చొప్పున ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా పరిశీలన చేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు డీఈఓ పేర్కొన్నారు.

స్కూల్ అసిస్టెంట్ల 1:3 ఎంపిక ఇలా

ఎల్‌పీ హిందీలో 32, తెలుగు 36, ఉర్దూ 9, పీఈటీ తెలుగు 9, ఉర్దూ 9, స్కూల్ అసిస్టెంట్ తెలుగు 49, ఇంగ్లీష్‌లో 37, హిందీ 20, ఉర్దూ 9, గణితం 36, ఫిజిక్స్ 6, బయోసైన్స్ తెలుగు–20, ఎస్ఏ బయోసైన్స్ ఉర్దూ 3, సోషల్ స్టడీస్ 111, ఏఎస్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 9 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. ఎంపిక జాబితాను డీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని.. వ్యక్తి ఆత్మహత్య

నిడమనూరు, అక్టోబర్ : తనతో గొడవ పెట్టుకొని భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపానికి గురైన వ్యక్తి గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని వేంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామకు చెందిన కట్టబోయిన శివ (30) కుటుంబ ఆర్థిక పరిస్థితులతో అప్పుల ఊబిలో కూరుకుపోయి మద్యానికి బానిసయ్యాడు. రెండు నెలల క్రితం వేంపాడు గ్రామంలోని పామాయిల్ తోటలో కూలీ పనుల కోసం భార్య ధనమ్మతో కలిసి వచ్చాడు. నిత్యం మద్యమత్తులో మునిగి తేలుతుండటంతో తరచుగా భార్యాభర్తలు గొడవపడేవారు. అతడి ప్రవర్తనతో విసిగి పోయిన ధనమ్మ నాలుగు రోజుల క్రితం కూతురును తీసుకొని నాలుగు రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివ సోమవారం రాత్రి గడ్డిమందు తాగాడు. గమనించిన తోటి కూలీలు అతడిని నల్లగొండలోని ప్రైవేటు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నిడమనూరు ఎస్ఐ జె.గోపాల్‌రావు తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా సత్తమ్మ

రామగిరి, అక్టోబర్ 2: ఉమ్మడి నల్లగొండ జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌గా కె.సత్తమ్మను నియమించారు. ప్రస్తుతం ఆమె యాదాద్రిభువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు జడ్పీహైస్కూల్‌లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. వాస్తవానికి సెప్టెంబర్ 30న ఆమెను నియమించినప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారులు విషయం బయటికి రాకుండా ఉంచడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు కోఆర్డినేటర్‌గా పనిచేసిన జగదీశ్‌కుమార్ పదవీకాలం ముగియడంతో డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ వారు సత్తమ్మను కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో ఆమె మంగళవారం బాధ్యతలు చేపట్టారు.

కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకులు, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

కేటీఆర్‌ను కలిసిన నాయకులు

చండూరు, అక్టోబర్ 2 : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను బుధవారం చండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళా వెంకన్న, మాజీ జడ్పీటీసీ అన్నెపర్తి శేఖర్, కౌన్సిలర్ గుంటి వెంకటేశం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

లావూడితండా వాసికి డాక్టరేట్

డాక్టరేట్ అందుకుంటున్న లావూడి సురేశ్

మిర్యాలగూడ, అక్టోబర్ 2: మండలంలోని లావూడితండాకు చెందిన లావూడి సురేశ్ హైదరాబాద్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లోని హెల్త్ సైన్సెస్ విభాగంలో ప్రొఫెసర్ బీఆర్.శ్యామన్న ఆధ్వర్యంలో సురేశ్ చేసిన పరిశోధనలను గుర్తించిన యూనివర్సిటీ ఇటీవల నిర్వహించిన 24న కాన్వకేషన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతులమీదుగా డాక్టరేట్ పట్టాను అందించింది. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ సామాన్యుల జీవితాల్లో వెలుగులు నింపేది విద్య మాత్రమే అన్నారు. సురేశ్ డాక్టరేట్ పొందడంపై తల్లిదండ్రులు తారాబాయి, సోమానాయక్, గ్రామస్తులు, బంజారా ఉద్యోగ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.